క్లుప్తంగా

వీధికుక్కలకు చర్మవ్యాధి



శునకానికి సోకిన చర్మవ్యాధి

లింగాపూర్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శునకాలు చర్మవ్యాధి బారిన పడుతున్నాయి. ఇది మనుషులకు కూడా సోకే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పంచాయతీ సిబ్బంది స్పందించి శునకాలను ఇతర ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

భూముల వేలం వాయిదా

సిర్పూర్(టి): సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని డొనల్ ప్రాంతంలో గల హజ్రత్ సయ్యద్ తాలిబ్ అలీషా బాబా దర్గా భూముల వేలం వాయిదా పడినట్లు దర్గా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ సాలెబిన్ సయిద్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం తదుపరి తేదీని నిర్ణయిస్తామన్నారు.

జేసీబీ, ట్రాక్టర్ల సీజ్

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని బెజ్జూర్ మండలంలోని రిజర్వు ఫారెస్టులో తవ్వకాలు చేస్తున్న ఒక జేసీబీ, నాలుగు ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు ఎఫ్‌డీవో సుశాంత్ బోబడే, బెజ్జూర్ ఎఫ్ఆర్‌వో ముసవీర్ తెలిపారు. మర్తడి బీట్ పరిధిలోని రిజర్వు ఫారెస్టులో అక్రమంగా మొరం, మట్టి తవ్వకాలు చేపట్టడంతో స్వాధీనం చేసుకున్నామన్నారు. పూర్తిస్థాయి నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

'అధికారుల అండదండలతోనే బియ్యం అక్రమ రవాణా'

కాగజ్‌నగర్ రూరల్: జిల్లాలో రెవెన్యూ, పోలీసు, సివిల్ సప్లయ్ అధికారుల అండదండలతోనే బియ్యం అక్రమ రవాణా సాగుతుందని సీపీఎం ఏరియా కమిటీ కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ అన్నారు. గత రెండు రోజుల క్రితం సిర్పూర్ (టి)లో 200 క్వింటాళ్లకు పైగా బియ్యం పోలీసుల తనిఖీల్లో పట్టుకోవడం జరిగిందన్నారు. బియ్యం అక్రమ రవాణాలో పోలీసు, రెవెన్యూ, సివిల్‌సప్లయ్ అధికారులకు ముడుపులు చెల్లించిన ఆడియో కూడా బయటపడిందన్నారు. విచారణ జరిపి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా భీమన్న పండుగ



ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నేరడిగొండ: మండల కేంద్రంలోని భీమన్న దేవాలయం వద్ద గురువారం భీమన్న పండుగను ఘనంగా నిర్వహించారు. డప్పువాయిద్యాల నడుమ భక్తులు సాంప్రదాయ నృత్యం చేశారు. ఈ సందర్భంగా మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల తాకిడితో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.

కుష్ఠుపై అపోహలు వద్దు



విద్యార్థులు ప్రతిజ్ఞ చేయిస్తున్న సాగర్

ఇచ్చోడ: కుష్ఠుపై అపోహలు పెట్టుకోవద్దని కుష్ఠు నివారణ విభాగం వైద్యులు సాగర్ అన్నా రు. గురువారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. వ్యాధి సోకిన వారిలో శరీరంపై పాలిపోయిన రాగి రంగు మచ్చలు, కాళ్లు చేతుల్లో తిమ్మిర్లు వస్తాయన్నారు. వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే సంబంధిత ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. అ నంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బోథ్: సొనాల మండల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. గురువారం సొనాల, కోట గ్రామస్తులు ఆడె గజేందర్‌ను కలిశారు. రాజరాజేశ్వరి ఆలయానికి బోరును వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గాజుల పోతన్న, లోలపు పోశెట్టి, పసుల గంగాధర్, చిలుకూరి నరేందర్, గంగారెడ్డి, మునేశ్వర్ సోమన్న, కోట పవన్, బాలాజీ, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో సంప్రదాయం!

- ఇప్పటికీ తెల్లని దుస్తులు ధరిస్తున్న వృద్ధులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న టోపీ



తెల్లని దుస్తులు కుడుతున్న దర్జీ



సంప్రదాయ దుస్తుల్లో రైతులు (ఫైల్)

కౌటాల: పేద, ధనిక అన్న తేడా ఉండదు. రంగు, వర్ణం అసలే పట్టదు. ఎనిమిది పదుల వయసులోనూ తెల్లని దుస్తులు, పంచెకట్టు, భుజాన కండువా, తెల్లని టోపి ఇది సిర్పూర్(టి) నియోజకవర్గంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న మరాఠీ గ్రామాల్లో కనిస్తుంది. ఊర్లో ఉన్న వృద్ధులను ప్రతిఒక్కరూ 'పటేల్' అంటూ ఒకరినొకరు పిలుచుకుంటారు. తెల్లని దుస్తులు, తలకు టోపి, పల్లె సంస్కతి ఇక్కడ కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయి.

సంప్రదాయం.. పల్లె రాజసం..

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో రెండు రాష్ట్రాల సంప్రాదాయాలను ప్రజలు పాటిస్తుంటారు. ముఖ్యంగా మన తెలంగాణ రాష్ట్ర పండుగలను మహారాష్ట్రలో కూడా జరుపుకుంటారు. మహారాష్ట్రలోని బల్లార్షా, చంద్రాపూర్, అహేరీ పట్టణాల నుంచి తెలంగాణలోని కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాల, ఆసిఫాబాద్, బెజ్జూర్, చింతలమానెపల్లి మండలాల్లో బంధువులు ఉండడంతో నిత్యం తెలంగాణ, మహారాష్ట్రకు ప్రజల రాకపోకలు సాగిస్తుంటారు. ఇక దోతీ, తువ్వాల, టోపీ సంస్కృతి మహారాష్ట్రలో కూడా ఎక్కువగా కనిపిస్తోంది. ప్రాణహిత, వార్ధా, పెన్‌గంగ నదుల సరిహద్దు గ్రామాలైన తాటిపల్లి, వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి, మొగడ్‌దగడ్, బాలేపల్లి, సాండ్‌గాం , వీరవెల్లి గ్రామాల్లో ఇప్పటికి తెల్లని దుస్తులు ధరిస్తు కనిపిస్తున్నారు.

వచ్చే తరానికి కష్టమే..

గ్రామీణ ప్రాంతాల్లోని సంస్కృతి, సంప్రదాయాల గురించి ఇప్పటి ఆధునిక తరానికి తెలిసింది చాలా తక్కువే. పల్లెలో మారిన పరిస్థితులు కూడిన దీని ప్రధాన కారణం. ఇప్పుడంతా జీన్స్, టీ షర్ట్‌లాంటి దుస్తులు ధరిస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని సంస్కృతి, సంప్రదాయాలను రానున్న తరం పుస్తకాల్లో చదువుకోవడమే తప్ప ఆచరించే అవకాశం కనిపించట్లేదు. సంస్కృతి, సంప్రదాయాలు పాటించినంత కాలం ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పెద్దలు చెబుతున్నారు.

టోపీలు కుడుతా



నేను రూపాయి కూలీ ఉన్నప్పటి నుంచి టోపీలు కుడుతున్నాను. ప్రతీరోజు 20 వరకు టోపీలు కుట్టేవాడిని. ఇప్పుడు ఊర్లో ఉన్న పెద్ద మనుషులు తప్ప వేరేవాళ్లు టోపీలను పెట్టుకోరు. ఇప్పుడు ఆడపాదడపా నాకు పరిచయం ఉన్న వ్యక్తులు మాత్రమే పండుగల సమయంలో కుట్టించుకుంటున్నారు. – సాంబయ్య, దర్జీ, కౌటాల

టోపీ తప్పనిసరి



నాకు ఇప్పుడు 70 ఏళ్లు. బుద్ధి నేర్చినప్పటి నుంచి దోతి కట్టుకోవడం, తలకు టోపీ లేకుండా ఉండను. మా తల్లిదండ్రులు ఇదే నేర్పారు. ఇప్పటి వరకు తలకు టోపీ లేకుండా బయటికి వెళ్లలేదు. దర్జీ ఒక టోపీని రూ. 100కి కుట్టి ఇస్తాడు. రంగు రంగుల బట్టలు నేను ఇప్పటి వరకు వేసుకోలేదు.

– కాశీనాథ్, వీర్దండి

తెల్లని దుస్తులే ధరిస్తా

నేను ఏ కార్యక్రమానికి వెళ్లినా తెల్లని దుస్తులే ధరిస్తాను. దోతీ, పంచె, టవల్, తలకు టోపీ లేకుండా ఎక్కడికి వెళ్లను. ఇతర ప్రాంతాలు, పొలానికి వెళ్లినా ఇలాగే వెళ్తుంటాను. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాన్ని నేను వదులుకోను.

– బందు పటేల్, గుండాయిపేట్

మహిళా శక్తికి 'ఉపాధి' భరోసా

- ఉపాధిహామీ పనుల్లో 20 రకాల పనులు కేటాయింపు
- ఆర్థికంగా బలోపేతానికి కృషి
- మార్చి 31 వరకు గడువు



పనులు కొలతలు తీసుకుంటున్న అధికారులు

కెరమెరి: మహిళలను లక్షాధికారుల చేయాలనే సంకల్పంతో ఉన్న ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం ఇప్పటికే పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు యూనిఫామ్‌లు కుట్టడం పనులను అప్పగించిన ప్రభుత్వం తాజాగా ఉపాధిహామీ పథకంలో 'ఇందిరమ్మ మహిళా శక్తి భరోసా' పేరుతో ప్రత్యేక పనులు కేటాయిస్తుంది. ఇచ్చిన పనులను ఆ మహిళలే చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తోంది. ఇందుకు మండల సమాఖ్యలోని మహిళా సంఘంలో ఉండడంతో పాటు ఉపాధిహామీ జాబ్ కార్డులు కలిగి ఉండాలి. మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉండగా జాబ్‌కార్డులు 9310 ఉండగా ఆక్టివ్ జాబ్ కార్డులు 650 ఉన్నాయి. కాగా 18230 మంది కూలీలకు 8310 మంది ఆక్టివ్‌గా ఉన్నారు.

20 రకాల పనులు..

ఉపాధిహామీ పథకంలో వివిధ రకాల పనులు ఉండగా ఇందిరమ్మ మహిళా శక్తి భరోసా పథకం కింద ప్రత్యేకంగా 20 రకాల పనులు కేటాయించారు. వాటిలో ఫారంపాండ్, క్యాటిల్ షెడ్, నాడెపు కంపోష్టు, పౌల్ట్రిఫామ్ 2 రకాలు, అజోల, నీటికుంటలు, ఇంకుడు గుంతలు, బావులు, వ్యవసాయానికి వెళ్లే రోడ్లు, అత్యవసర రోడ్లు, వ్యవసాయ బావులు, రాళ్ల కట్టలు, చెక్‌డ్యాంలు పనులు ఉంటాయి. వీటిని కేవలం మహిళా సంఘాల సభ్యులు మాత్రమే చేయాల్సి ఉంటుంది. బిల్లులు కూడా వారి పేరిటే జనరేట్ అవుతాయి. ఆయా పనులకు ప్రభుత్వం రూ. 48 లక్షలను మంజూరు చేసింది. ఆయా పనుల్లో ఇప్పటికే 50 శాతం పూర్తి అయినట్లు ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు. మహిళా సంఘాలకు అప్పగించిన పనులు మార్చి 31 లోపు పూర్తి చేయాల్సి ఉంది.

పనులు వేగవంతం చేస్తాం



ఇందిరమ్మ మహిళా శక్తి భరోసా కింద మహిళలు 20 పనులు మంజూరు అయ్యాయి. వాటిని పూర్తిస్థాయిలో మహిళా సంఘాల సభ్యులచే చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే అప్పగించిన పనుల్లో 50 శాతం పూర్తి అయ్యాయి. కింత వరకు బిల్లులు కూడా చెల్లించడం జరిగింది.

– బి. మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో, కెరమెరి

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి



ఎమ్మెల్సీతో కాంగ్రెస్ నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: ప్రతిఒక్కరూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో కాంగ్రెస్ నాయకులు గజ్జల సురేశ్ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా తీర్థప్రసాదాలను ఎమ్మెల్సీకి అందజేశారు. అనంతరం శాలువాతో సత్కరించారు. 144 సంవత్సరాల తర్వాత రావడం జరిగిందని, మహాకుంభమేళా జరుగుతున్న ప్రయాగరాజ్‌లోని గంగా, యమునా, సరస్వతీ నదుల త్రివేణి సంగమంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పునీతులు కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, సిరిపురం సదాశివ్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు సత్తా చాటాలని బీఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆరె సంఘం భవనంలో మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్‌తోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఆర్ఎస్పీ నాయకత్వంలో సిర్పూర్‌లో గులాబీ జెండా ఎగర వేస్తామన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు నాగపూరే బండు, రాజు, తాళ్లపల్లి కార్తీకర్, చునాకర్ దీలిప్, గోవింద్‌రావ్, మనోహర్, నరేందర్, నవీన్, ప్రశాంత్, బాజీరావు, మనోహర్, గురుదాస్ పాల్గొన్నారు.

ఏరియాకు పూర్వ వైభవం తీసుకురావాలి



వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో యాజమాన్యం ప్రారంభించనున్న గోలేటి, మాదారం ఓసీపీలను త్వరితగతిన ప్రారంభించి ఏరియాకు పూర్వవైభవం తీసుకురావాలని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ కోరారు. బుధవారం అర్ధరాత్రి ఏరియా పర్యటనకు వచ్చిన సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను కై రిగూడ ఓసీపీలో కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో స్పెషలిస్టు డాక్టర్లను నియమించాలని, గోలేటి, మాదారం టౌన్‌షిప్‌ల్లో శుద్ధి చేసిన తాగునీటిని సరాఫరా చేయాలని కోరారు. పెర్క్స్‌పై విధిస్తున్న ఐటీని పూర్తిగా రద్దు చేయాలన్నారు. కార్మికుల కోసం డబుల్ బెడ్రూం క్వార్టర్లను నిర్మించాలని, నివాసయోగ్యమైన ఇంటి స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి రూ.20లక్షల వడ్డీ లేని రుణం అందించాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ కార్యదర్శి రామారావు, ఆర్గనైజర్ సెక్రటరీ నారాయణ, ఏరియా కార్యదర్శి సంజీవ రెడ్డి, నాయకులు అంబేద్కర్, ప్రభాకర్, భీమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

టైం బాండ్ ప్రకారం పదోన్నతులు కల్పించాలి

సింగరేణిలో వేకెన్సీతో సంబంధం లేకుండా టైం బాండ్ ప్రకారం పదోన్నతులు కల్పించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి కోరారు. కైరిగూడ ఓసీపీలో సీఎండీ బలరాంనాయక్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ కై రిగూడ ఓసీపీలో గతేడాది నిర్వహించిన గ్రేడ్ టెస్ట్‌లో సీ, బీ, ఏ గ్రేడ్లలో ఆపరేటర్లు ఉత్తీర్ణత సాధించినా ఖాళీలు లేవనే కారణంతో పదోన్నతులు కల్పించలేదన్నారు. ఏరియాలో మూతపడిన గనుల నుంచి తాగునీటిని సరాఫరా చేస్తుండటంతో ఇనుము శాతం అధికంగా ఉండి కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. మ్యాన్ పవర్, గోలేటిలో ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషశయనరావు, రాజేష్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువత అన్నిరంగాల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న జాన్సన్ నాయక్

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత యువత క్రీడలతో పాటు చదువులో రాణించాలని బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. ఏమాయికుంట ఈగల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఈసందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంతోష్ చింతవార్, గణేష్ టహరే, దిపక్ చింతవార్, మీర్జా జీలానిబేగ్, జాదవ్ లఖన్ పాల్గొన్నారు.

'ఆలయాల అభివృద్ధికి చిల్లిగవ్వ ఇవ్వలేదు'



పూజలు చేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే ఉన్నప్పటికీ ఆలయ నిర్మాణాలకు చిల్లిగవ్వ ఇవ్వలేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జైనథ్ మండలంలోని అర్లి, కంఠ, ఆకోలి, కోరట, గూడా గ్రామాల్లోని హనుమాన్, రామ మందిరాలు, పోచమ్మ, మైసమ్మ ఆలయాలను గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.20 కోట్లతో పలు ఆలయాల నిర్మాణాలను చేపట్టామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధుల కొరతతో నిలిచిపోయిన ఆలయాల నిర్మాణాలను పూర్తిచేసే దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఆయన వెంట మార్శెట్టి గోవర్ధన్, నారాయణ, మెట్టు ప్రహ్లాద్, గంద్రత్ రమేష్, భోజన్న, గంగయ్య, బట్టు సతీష్, ప్రభాకర్, రమణ, మహేశ్ పాల్గొన్నారు.

రాజకీయ నాయకులతో సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో కోట ప్రసాద్

కౌటాల: కౌటాల ఎంపీడీవో కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కోట ప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్ని కల ముసాయిదా, పోలింగ్ కేంద్రాల వివరాల ను పార్టీ నాయకులకు తెలియజేశారు. రాజకీ య నాయకుల అభ్యంతరాలు, సలహాలు, సూ చనలు స్వీకరించమన్నారు. సమావేశంలో నా యకులు వానుపటేల్, మోతిరాం, విజయ్, విఠ ల్, తిరుపతి, గోపాల్, రవి, శంకర్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను మండలంలో పారదర్శంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి తీసుకొనే ప్రతీ నిర్ణయంలో రాజకీయ నాయకుల పాత్ర ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

పెంచికల్‌పేట్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి గురువారం పెంచికల్‌పేట్ మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆల్బర్ట్ పాల్గొని గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల గురించి చర్చించారు. మండలంలో 5 ఎంపీటీసీ స్థానాలు, జెడ్పీటీసీ స్థానానికి మొత్తం 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుకుడే రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బిట్టి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు లచ్చన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కెరమెరి: పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా విడుదల చేసినట్లు ఎంపీడీవో అంజద్‌పాషా తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ ఎన్నికలకు 51 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో అంజద్‌పాషా



సమావేశంలో పాల్గొన్న నాయకులు

దహెగాం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గురువారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో రాజేందర్ మాట్లాడుతూ.. 45 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వాటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే చెప్పాలన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

లింగాపూర్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో రామచందర్ సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వివరాలు, ఓటరు జాబితా చర్చించారు. మండలంలో మొత్తం 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆడే సురేశ్ నాయక్, జాదవ్ లోకేందర్, జాదవ్ గణపతి, రాహుల్ పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు



స్వాధీనం చేసుకున్న మద్యం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. గురువారం పలు బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. జైస్వాల్ పవాన్ షాపులో దొరికిన రూ. 5628 రూపాయల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని రాంనగర్‌లో కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు. కష్టపడిన ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం దుబ్బగూడ గ్రామానికి సందర్శించి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ తుంరం లక్ష్మణ్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, నాయకులు పవార్ దుదిరామ్, కోరెంగా సుంకట్‌రావ్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

కౌటాల: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని కౌటాల సీఐ ముత్యం రమేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని భారతీ విద్యామందిర్ పాఠశాలలో బెల్లంపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ వెంకటేశ్, పాఠశాలల కరస్పాండెంట్ దుర్గం గోపాల్, చారి తిరుపతి, సభ్యులు సత్యనారాయణ, కిషన్‌రావు, నారాయణ సర్కార్, సందీప్ పాల్గొన్నారు.